క్లుప్తంగా

నేడు హుజూర్‌నగర్‌కు మంత్రుల రాక

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్ పట్టణానికి శనివారం తెలంగాణ రాష్ట్ర నీటిపారుదల, ఆహార, పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, రెవెన్యూ, గృహనిర్మాణం, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి రానున్నారు. వారు స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో పలు శాఖల అధికారులతో నిర్వహించే సమీక్ష సమావేశంలో పాల్గొననున్నారు.

ఆక్రమణ ఫిర్యాదుపై అధికారుల విచారణ


విచారణ చేస్తున్న రెవెన్యూ అధికారులు

కోదాడరూరల్ : పట్టణ పరిధిలోని లక్ష్మీపురం ఇందిరమ్మ కాలనీలో 350గజాల ప్రభుత్వ స్థలాన్ని అల్వాల కోటయ్య అనే వ్యక్తి ఆక్రమించుకొని ఇంటిని నిర్మించే ప్రయత్నంలో ఉన్నాడని గ్రామానికి చెందిన మేకపోతుల సత్యనారాయణ ఇటీవల కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు. అందుకు స్పందించిన కలెక్టర్ స్థానిక రెవెన్యూ అధికారులను విచారణకు ఆదేశించారు. దీంతో శుక్రవారం ఆర్‌ఐ వెంకటనగేష్ సర్వేయర్ బీక్యానాయక్‌తో కలిసి స్థలం వద్దకు వెళ్లి విచారణ చేపట్టారు. విచారణపై పూర్తి నివేదిక తయారు చేసి కలెక్టర్‌కు అందజేయనున్నట్లు వారు వెల్లడించారు.

బేతవోలులో ఫీవర్ సర్వే


సర్వే చేస్తున్న వైద్యసిబ్బంది

చిలుకూరు : మండలంలోని బేతవోలు గ్రామంలో వైద్యసిబ్బంది శుక్రవారం ఇంటింటికి తిరుగుతూ జ్వరం సర్వే నిర్వహించారు. జ్వరం వచ్చిన వారిని గుర్తించి వారికి మందులు పంపిణీ చేశారు. గ్రామస్తులు ఏమైనా వైద్యసమస్యలు ఉంటే ఆరోగ్య కేంద్రానికి వచ్చి చికిత్స చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ వినోద్, ఏఎన్‌ఎంలు, ఆశవర్కర్లు, వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు సిరిపురంలో రైతు దినోత్సవం

నడిగూడెం : మండల పరిధిలోని సిరిపురం రైతువేదికలో శనివారం జాతీయ రైతు దినోత్సవాన్ని సిరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు ఆ సంస్థ వ్యవస్థాపకుడు ఎం.గోపి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో రైతులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

అయ్యప్ప మాలధారులకు అన్నదానం



అన్నదానం చేస్తున్న దాత, నిర్వాహకులు

కోదాడరూరల్ : పట్టణ పరిధిలోని హుజూర్‌నగర్ రోడ్‌లో గల గాలి రమేష్‌నాయుడు అయ్యప్ప సన్నిధానంలో శుక్రవారం మాలధారులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని నర్రా లక్ష్మీశ్రావణి, కంసాని యశ్వంత్ జన్మదినం సందర్భంగా వారి తల్లిదండ్రులు సైదయ్య, రేణుక ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ అన్నదానంలో 450మంది మాలధారులు పాల్గొన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు గాలి శ్రీనివాసు నాయుడు, సీతరాంసింగ్, రంగారావు, నాగరాజులు, మాలధారులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు అన్నదానం

కోదాడరూరల్ : పట్టణ పరిధిలోని అశోక్‌నగర్‌లో గల మానసిక దివ్యాంగుల కేంద్రంలో పట్టణానికి చెందిన ఎండీ అక్బర్ జన్మదినం సందర్భంగా శుక్రవారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అంతకు ముందు పట్టణంలోని ముత్యాలమ్మగుడి వద్ద రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు వంగవీటి రామారావు, కౌన్సిలర్‌లు కందుల కోటేశ్వరరావు, షాబుద్దీన్, దగడు సాయి, సుమంత్ ఉన్నారు.

ఉచిత వైద్యశిబిరం


వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

మేళ్లచెరువు : మండలంలోని రెయిన్ సిమెంట్ పరిశ్రమ ఆధ్వర్యంలో రామపురంలోని పరిశ్రమ కాలనీలో శుక్రవారం వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో హైదరాబాద్ యశోద ఆస్పత్రి వైద్యులు పాల్గొని ప్రజలకు గుండె, ఎముకలు, కీళ్లు, స్త్రీల వ్యాధుల పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో పరిశ్రమ జీఎం.గురప్ప, శ్రీనివాసరెడ్డి, వెంకటేశ్వరరావు, డాక్టర్ రజినీకాంత్, డాక్టర్ చంద్రకాంత్, పరిసర ప్రజలు పాల్గొన్నారు.

వద్దన్నా.. వరిసాగుకే మొగ్గు

- సాగర్ ఆయకట్టులో క్రాఫ్‌హాలీడే ప్రకటించిన అధికారులు
- పట్టించుకోకుండా వరిసాగులో నిమగ్నమైన రైతాంగం
- ప్రత్యామ్నాయ పంటలు సాగుచేయాలని అవగాహన

కోదాడరూరల్ : నాగార్జునసాగర్ రిజర్వాయర్‌లో యాసంగి సాగుకు సరిపడా నీరు లేకపోవడంతో అధికారులు ఆయకట్టులో క్రాఫ్ హాలిడే ప్రకటించారు. దీంతో వరిసాగు బదులుగా తమకున్న నీటి వనరులతో ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని వ్యవసాయాధికారులు రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. అయినా రైతులు మాత్రం అవేవి పట్టించుకోకుండా వరిసాగు వైపే మొగ్గుచూపుతున్నారు. ఇప్పటికే కొందరు రైతులు వరినార్లు పోసుకొని నాట్లు పెట్టుకోగా మరికొంత మంది దుక్కులు దున్నే పనిలో నిమగ్నమయ్యారు.

వరివైపే రైతుల ఆసక్తి..

ఆయకట్టులోని రైతులు బోర్లు, బావులు, వాగుల్లో మోటార్లతో తమకున్న నీటి వనరులతో ఎక్కువగా వరిసాగు చేసేందుకు ముందుకెళ్తున్నారు. దీనికి కారణం గత రెండేళ్లుగా ధాన్యానికి మార్కెట్‌లో మంచి ధర లభిస్తుండంతో పాటు ఇతర పంటలతో పోల్చితే తక్కువ శ్రమ ఉండటంతో రైతులు వరివైపే ఆసక్తి చూపుతున్నారు. అయితే వానాకాలం సీజన్‌లో సాగర్ నీరు రాకపోయినా వచ్చిపోయే వర్షాలతో పొలాలకు నీరు అందడమే


వరినాట్లు వేస్తున్న కూలీలు

కాకుండా బావులు, బోర్లు, వాగుల్లో భూగర్భ జలాలు ఉండటంతో ఎదో విధంగా పంటలను కాపాడుకోవచ్చనే ధైర్యంతో సాగు చేశారు. కానీ ఈ యాసంగిలో ప్రస్తుతం ఉన్న నీటి వనరులతో సాగు చేస్తే తీరా జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలల్లో నీటి అవసరం ఎక్కువగా ఉండటంతో పాటు ఎండలు పెరిగి బోర్లు, బావుల్లో భూగర్భజలాలు పడిపోయే అవకాశం లేకపోలేదు. దీంతో పంటలు చేతికొచ్చే సమయంలో రైతులు ఇబ్బందులు ఎదుర్కొనే ప్రమాదం ఉంటుందని పలువురు అధికారులు సూచిస్తున్నారు.

నీటి ఆధారం ఉంటేనే సాగుచేసుకోవాలి..

వ్యవసాయాధికారులు గ్రామాల్లో యాసంగి వరిసాగుపై అవగాహన కలిగిస్తున్నారు. సాగు చేసే పంటకు పూర్తిస్థాయిలో నీటి ఆధారం ఉంటేనే వరిసాగు చేసుకోవాలని సూచనలు చేస్తున్నారు. ఓ రైతుకు సుమారుగా 10ఎకరాలు ఉంటే తమకున్న నీటి వనరులను అంచనా వేసుకొని ఎంత మేర పారుతుందో అంతవరకే నాట్లువేసుకోవాలని


పొలం దున్నుతున్న రైతు

సూచిస్తున్నారు. మిగిలిన భూమిలో ఆరుతడి పంటలైన పెసర, మినుము, అలసంద, వేరుశనగా వంటి వాటిని సాగు చేయాలని అంటున్నారు. కోదాడ మండలంలో సాధారణంగా వరిసాగు 27వేల ఎకరాలు కాగా ఇప్పటి వరకు 11వేల ఎకరాల్లో సాగు చేసినట్లు వ్యవసాయాధికారులు అంచనా వేశారు.

ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన కల్పిస్తున్నాం



సాగర్ ఆయకట్టులో నీరు వచ్చే అవకాశం లేకపోవడంతో రైతులకు ప్రత్యామ్నాయ పంటల సాగుపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పిస్తున్నాం. నీటి లభ్యత ఆధారంగానే వరిసాగు చేసుకోవాలి. ఈ సీజన్‌లో మండలంలో 15వేల ఎకరాలను మించి వరిసాగు కాకపోవచ్చని అంచనా వేస్తున్నాం.

– పాలెం రజిని, ఏఓ, కోదాడ

మాదకద్రవ్యాల నివారణకు సహకరించాలి

హుజూర్‌నగర్ : సమాజంలో మాదకద్రవ్యాల నివారణకు అందరూ సహకరిచాలని ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి, డీఎస్పీ ప్రకాష్ కోరారు. శుక్రవారం పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయంలో పోలీస్, ఐసీడీఎస్, విద్య, వైద్యం, ఎక్సైజ్, ఫారెస్ట్, మున్సిపల్ తదితర శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. ఏపీ, ఒడిశా రాష్ట్రాల నుంచి గంజాయి రవాణా అవుతుందని దానిని పూర్తిస్థాయిలో అరికట్టేందుకు తగిన చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. విద్యార్థులు, యువకులను మత్తుపదార్థాలకు అలవాటు చేసి బానిసలుగా మారుస్తున్నట్లు తాము గుర్తించామన్నారు. కార్యక్రమంలో సీఐలు రామలింగారెడ్డి, రామకృష్ణారెడ్డి, మున్సిపల్ కమిషనర్లు శ్రీనివాసరెడ్డి, వెంకటేశ్వర్లు, తహసీల్దార్‌లు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి పక్కన డీఎస్పీ ప్రకాష్

కాంగ్రెస్‌లో పీఏసీఎస్ చైర్మన్ చేరిక


కాంగ్రెస్‌లో చేరిన వారితో మంత్రి ఉత్తమ్

హుజూర్‌నగర్ : పట్టణానికి చెందిన పలువురు బీఆర్‌ఎస్ నాయకులు శుక్రవారం హైదరాబాద్‌లో రాష్ట్ర నీటిపారుదల, ఆహార పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. పార్టీలో చేరిన వారిలో హుజూర్‌నగర్ పీఏసీఎస్ చైర్మన్ యరగాని శ్రీనివాస్, కౌన్సిలర్ యరగాని గురవయ్య, నాయకులు యరగాని సత్యనారాయణ ఉన్నారు. వారికి మంత్రి కాంగ్రెస్ కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

హస్తంగూటికి బీఆర్‌ఎస్ కౌన్సిలర్


కాంగ్రెస్‌లో చేరిన బీఆర్‌ఎస్ కౌన్సిలర్‌తో స్థానిక నాయకులు

హుజూర్‌నగర్ : మున్సిపాలిటీలోని 1వ వార్డు బీఆర్‌ఎస్ కౌన్సిలర్ కొమ్ము శ్రీనివాస్ శుక్రవారం కాంగ్రెస్ చేరారు. ఆయనకు కాంగ్రెస్ నాయకుడు గెల్లి రవి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు కోతి సంపత్‌రెడ్డి, కస్తాల శ్రావణ్‌కుమార్, తేజవత్ రాజా, సతీష్, నాగరాజు, వీరారెడ్డి, భాస్కర్, యడ్ల విజయ్, శ్రీను, రాము ఉన్నారు.

కొనసాగుతున్న ధనుర్మాస ఉత్సవాలు


హుజూర్‌నగర్ : ప్రవచిస్తున్న ప్రచారకుడు దామోదరాచార్యులు

హుజూర్‌నగర్ : పట్టణంలోని టీచర్స్‌కాలనీలో గల శ్రీజ్ఞాన సరస్వతి ఆలయంలో శుక్రవారం ధనుర్మాస ఉత్సవాలు కొనసాగాయి. వేకువజాముననే మహిళలు హారతులతో, పూలు, పండ్లతో ఆలయానికి వచ్చి అమ్మవారికి పూజలు చేశారు. శ్రీకృష్ణ, గోదా, రామానుజ అష్టోత్తరాలను పటించి తిరుప్పావై సేవాకాలాన్ని శ్రావ్యంగా గానం చేశారు. సాయంత్రం గోదా, శ్రీకృష్ణ ఉత్సవమూర్తులను పల్లకిలో వేంచేసి దేవాలయ ప్రదక్షిణం గావించారు. ఈ సందర్భంగా తితిదే ఆళ్వార్ దివ్య ప్రబంధ ప్రాజెక్టు ప్రచారకులు దామోదరాచార్యులు మాట్లాడుతూ.. భగవంతుడిపై ప్రేమతో ఆరాధించిన వారి జీవితం సాఫల్యం చెందుతుందన్నారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్, మహిళలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

హుజూర్‌నగర్ రూరల్ : మండలంలోని బూరుగడ్డలో గల శ్రీశాల్మలీకంద ఆదివరహ లక్ష్మీనర్సింహ వేణుగోపాలస్వామి దేవాలయంలో శుక్రవారం ధనుర్మాస ఉత్సవాలు వైభవంగా కొనసాగాయి. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం సుప్రభాత సేవ, ఆరాధన, పుణ్యాహవచనం, స్వామివార్లకు పంచామృతాలతో అభిషేకం, అష్టోత్తర శతనామావళి, సేవాకాలం, అళ్వార్లకు మంగళశాసనం కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. అనంతరం గోమాతకు పూజా కార్యక్రమాలతో పాటు గోదాదేవి అమ్మవారికి పల్లకిసేవ, తీర్థప్రసాదగోష్టి, ఆరగింపు తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ గండు సైదులు, ఈఓ ఎంపీ లక్ష్మణరావు, ధర్మకర్తలు సురభి కుషల్, కనకయ్య, మల్లయ్య, అర్చకులు ముడుంబై మనోహరాచార్యులు, హరీష్‌కుమార్ చార్యులు, సిబ్బంది గోవిందరెడ్డి, కిరణ్‌కుమార్ గౌడ్, రమేష్, ఉపేందర్, భక్తులు పాల్గొన్నారు.


హుజూర్‌నగర్‌రూరల్ : గోమాతకు పూజలు చేస్తున్న భక్తులు

శ్రీనివాస రామానుజన్ స్ఫూర్తితో ముందుకెళ్లాలి

కోదాడఅర్బన్ : గణిత మేధావి శ్రీనివాస రామానుజన్ స్ఫూర్తితో విద్యార్థులు గణితశాస్త్రంలో రాణిస్తూ ముందుకు సాగాలని ఎస్‌ఆర్‌ఎం విద్యాసంస్థల చైర్‌పర్సన్ కేశినేని శ్రీదేవి అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఆయా పాఠశాలల్లో గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పాఠశాల విద్యార్థులు తయారు చేసిన వివిధ గణిత నమూనాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్‌పర్సన్ శ్రీదేవి మాట్లాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్లోబల్ స్కూల్లో వేడుకలు..

స్థానిక గ్లోబల్ పాఠశాలలో గణిత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. శుక్రవారం గణిత మేధావి రామానుజన్ జయంతిని పురస్కరించుకుని ఆయన కనుగొన్న గణిత నమూనాల ప్రయోగాలను విద్యార్థులు తయారు చేసి ప్రదర్శించారు. అంతకు ముందు రామానుజన్ చిత్రపటానికి పాఠశాల హెచ్‌ఎం చిల్యాల శ్రీనివాసరెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో శ్రీ శ్రీనివాస ఎడ్యుకేషన్ సొసైటీ చైర్‌పర్సన్ కవిత, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

నేరేడుచర్ల : మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం శ్రీనివాస రామానుజన్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం బట్టు మధు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో వ్యాసరచన, చిత్రలేఖనం, క్విజ్ పోటీలు నిర్వహించారు. అనంతరం విద్యార్థులు రామానుజన్ సంఖ్య 1729 ఆకృతిలో కూర్చున్నారు. కార్యక్రమంలో కొణతం చినవెంకట్‌రెడ్డి, గణేష్‌రెడ్డి,


కోదాడఅర్బన్ : ఎస్‌ఆర్‌ఎం పాఠశాలలో గణిత శాస్త్ర నమూనాలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

లయన్స్‌క్లబ్ అధ్యక్షులు చల్లా ప్రభాకర్‌రెడ్డి, గుండా సత్యనారాయణ, రంగారెడ్డి, విశ్వనాథం, కనకయ్య, వార్డెన్ సైదులు, ఉపాధ్యాయులు సరసకుమారీ, ఎం.సైదులు, రషీద్‌ఖాన్, శౌరీ, అన్నపూర్ణ, నర్సింహారావు, మాధవి, కళ్యాణి, స్రవంతి, కల్పన, శ్రీనివాస్‌రెడ్డి, సరస్వతి తదితరులున్నారు.

ఘనంగా రామానుజన్ జయంతి

చిలుకూరు : మండలంలోని రామాపురం జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం గణిత మాంత్రికుడు శ్రీనివాస్ రామానుజన్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పలువురు ఉపాధ్యాయులు మాట్లాడారు. అనంతరం విద్యార్థులకు క్విజ్, గణితం పజిల్స్‌పై టెస్టు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ శివకుమారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అలాగే మండల పరిధిలోని గ్లోబస్ ఇంటర్నేషనల్ పాఠశాలలో రామానుజన్ జయంతిని నిర్వహించారు.

నడిగూడెం : మండల కేంద్రంలోని సాంఘీక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో శుక్రవారం గణిత మేధావి శ్రీనివాస రామానుజన్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన


నడిగూడెంలో రామానుజన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్ ధనవిజయలక్ష్మి

చిత్రపటానికి ప్రిన్సిపాల్ సీహెచ్.ధనవిజయలక్ష్మి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్, వకృత్వ పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుజాత, నిర్మల, సునీత, భాను, విద్యార్థులు పాల్గొన్నారు.

మేళ్లచెరువు : గణిత శాస్త్ర మాంత్రికుడు శ్రీనివాస రామానుజన్ జయంతి వేడుకలను మండలంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలు ప్రైవేట్, ప్రభుత్వ విద్యాసంస్థల్లో గణిత దినోత్సవాన్ని జరుపుకున్నారు. అనంతరం విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గణిత దినోత్సవం

హుజూర్‌నగర్ : పట్టణంలోని పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో శుక్రవారం గణిత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గణిత మేధావి శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమాల్లో పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



నేరేడుచర్ల : జెడ్పీ పాఠశాలలో 1729 నంబర్ ఆకృతిలో కూర్చున విద్యార్థులు


చిలుకూరు : రామానుజన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు


మేళ్లచెరువు : గణిత ఫార్ములాలు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

కేంద్ర పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

నడిగూడెం : రైతుల కోసం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎస్‌బీఐ రీజినల్ మేనేజర్ జ్యోతి అన్నారు. శుక్రవారం మండలంలోని రత్నవరం రైతువేదికలో వికసిత్ భారత్ సంకల్పయాత్రలో భాగంగా రైతులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం రైతుల కోసం అమలు చేస్తున్న ఫార్మర్స్ ప్రొడ్యూసర్ ఆర్గనైజర్స్‌ల ఏర్పాటుకు రైతులు ముందుకు రావాలని, పథకాలు, రుణాలు, ఇంకా పలు రాయితీలపై అవగాహన కల్పించారు. అనంతరం సిరిపురం గ్రామానికి చెందిన అభ్యుదయ రైతు వాసికర్ల శేషుకుమార్‌ను సన్మానించారు. కార్యక్రమంలో కోదాడ వ్యవసాయ శాఖ ఏడీఏ తంగెళ్ల వాసు, లీడ్ బ్యాంకు మేనేజర్ బాపూజీ, మండల వ్యవసాయాధికారి ఎం.రాజగోపాలరావు, గ్రామ సర్పంచ్ పగడాల పద్మ, నడిగూడెం ఎస్‌బీఐ బ్రాంచి మేనేజర్ సుబ్రహ్మణ్యం, సింగిల్‌విండో మాజీ చైర్మన్ పగడాల ప్రభాకర్‌రెడ్డి, ఏఈఓలు మౌనిక, వినోద్, రైతులు వెంకటరెడ్డి, వినయ్‌వర్ధన్, రామిరెడ్డి, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎస్‌బీఐ రీజినల్ మేనేజర్ జ్యోతి

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి


సమావేశంలో మాట్లాడుతున్న నాగార్జున సిమెంట్ పరిశ్రమ ఎండీ గౌతమ్

మఠంపల్లి : పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలని నాగార్జున సిమెంట్స్ పరిశ్రమ ఎండీ కలిదిండి గౌతమ్ అన్నారు. శుక్రవారం పరిశ్రమ 40వ వార్షికోత్సవం సందర్భంగా ఆయన మొక్కలు నాటి అన్నదానం కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడారు. మండలంలోని నాగార్జున సిమెంట్స్ పరిశ్రమ పరిధిలోని వివిధ గ్రామాలు, తండాలు అటవీ ప్రాంతాల్లో ప్రతిఏటా రూ.కోటితో మొక్కలు, చెట్ల పెంపకం చేపడుతున్నట్లు తెలిపారు. పర్యావరణంతో పాటు విద్యా, వైద్యానికి ప్రతిఏటా రూ.2కోట్లు కేటాయిస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఎన్‌సీఎల్ ప్రెసిడెంట్ ఎస్.చక్రధర్, బైసన్‌బోర్డు జీఎం రఘువర్మ, ప్లాంట్‌జీఎం సతీష్‌కుమార్, సీనియర్ మేనేజర్ దస్తగిరిరెడ్డి, చెన్నూరు విజయ్‌కుమార్, యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు కేశవరాజు, శ్రీనివాసాచార్యులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పీఏసీఎస్ చైర్మన్‌పై అవిశ్వాస నోటీసు అందజేత


జిల్లా అధికారి శ్రీధర్‌కు అవిశ్వాస నోటీసు అందజేస్తున్న పీఏసీఎస్ వైస్‌చైర్మన్, డైరెక్టర్లు

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్ పీఏసీఎస్ చైర్మన్ యరగాని శ్రీనివాస్‌పై ఆ సంఘం డైరెక్టర్లు అవిశ్వాస తీర్మాణానికి సిద్ధమయ్యారు. ఈ నేపథ్యంలో శుక్రవారం జిల్లా సహకార అధికారి శ్రీధర్‌కు నోటీసు అందజేశారు. అనంతరం వారు మాట్లాడారు. బడ్జెట్ లావాదేవీలు, రైతులకు రుణాలు ఇచ్చే విషయంలో చైర్మన్ తమకు ఎలాంటి సమాచారం ఇవ్వడం లేదన్నారు. పీఏసీఎస్‌లో చైర్మన్‌తో సహా మొత్తం 13మంది డైరెక్టర్లు ఉండగా 12మంది డైరెక్టర్లు సంతకాలతో కూడిన నోటీసును జిల్లా అధికారికి అందజేసినట్లు పేర్కొన్నారు. నోటీసు అందజేసిన వారిలో వైస్‌చైర్మన్ కంచర్ల మధుసూదన్‌రెడ్డి, డైరెక్టర్‌లు జక్కుల నరేందర్, రాయల వెంకటేశ్వర్లు, కటారి శ్రీను, గోసుల శ్రీను ఉన్నారు.

నర్సరీలు, రికార్డుల పరిశీలన


నర్సరీని పరిశీలిస్తున్న ఎంపీడీఓ జానకిరాములు

మఠంపల్లి : మండలంలోని బక్కమంతులగూడెం, కాల్వపల్లితండా గ్రామపంచాయతీలను శుక్రవారం ఎంపీడీఓ జానకిరాములు, ఎంపీఓ ఆంజనేయులు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయాగ్రామాల్లోని నర్సరీలను పరిశీలించి పంచాయతీ రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడారు. మండలంలోని క్రిస్టియన్లకు ఈనెల 23న హుజూర్‌నగర్‌లోని మేళ్లచెర్వు రోడ్డులో గల శ్రీలక్ష్మి ఫంక్షన్‌హాల్‌లో క్రిస్మస్ దుస్తులను ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. వారి వెంట సర్పంచ్‌లు విజయలక్ష్మీవెంకట్‌రెడ్డి, సుజాతాసక్రునాయక్, కార్యదర్శి మౌనిక, ఉపాధి సిబ్బంది, తదితరులున్నారు.

పలు మండలాల్లో నేడు విద్యుత్ గ్రీవెన్స్ డే

గరిడేపల్లి : విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో శనివారం విద్యుత్ గ్రీవెన్స్ డే నిర్వహిస్తున్నట్లు హుజూర్‌నగర్ విద్యుత్ డివిజన్ అధికారి వెంకటకృష్ణయ్య శుక్రవారం తెలిపారు.

నడిగూడెం : మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో శనివారం విద్యుత్ గ్రీవెన్ డే నిర్వహించనున్నట్లు విద్యుత్ ఏఈ ఎస్‌కె.సైదా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సమస్యలపై దరఖాస్తులు తీసుకోనున్నట్లు ఆయన వెల్లడించారు. వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

అనంతగిరి : మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో శనివారం గ్రీవెన్స్‌డే నిర్వహిస్తున్నట్లు విద్యుత్ ఏఈ మారుడి కీర్తిరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి జిల్లా, డివిజన్ విద్యుత్ అధికారులు హాజరు కానున్నట్లు ఆమె తెలిపారు. మండలంలో విద్యుత్ సమస్యలపై అధికారులకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఉపాధ్యాయులు విద్యాభివృద్ధికి కృషిచేయాలి

నడిగూడెం : ఉపాధ్యాయులు విద్యాభివృద్ధికి కృషి చేయాలని నోడల్ అధికారి డాక్టర్ శోభన్‌బాబు అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని సిరిపురం ఉన్నత పాఠశాలను పరిశీలించిన అనంతరం ఆయన ఉపాధ్యాయులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మాట్లాడారు. వెనుకబడిన విద్యార్థుల పట్ల ఎప్పటికప్పుడు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం యలమర్తి శౌరి, ఉపాధ్యాయులు ఉన్నారు.

ఆర్‌ఎంపీ, పీఎంపీల సమస్యలు పరిష్కరించాలి

హుజూర్‌నగర్ : ఆర్‌ఎంపీ, పీఎంపీలు ఎదుర్కొంటున్న పలు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆ సంఘం నాయకులు శుక్రవారం హైదరాబాద్‌లో కోదాడ ఎమ్మెల్యే పద్మావతిని కలిశారు. ఈ సందర్భంగా వారు ఆమెకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఎమ్మెల్యేకు సంఘం నాయకులు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

అదుపుతప్పి ట్రాక్టర్ బోల్తా

హుజూర్‌నగర్ రూరల్ : అదుపు తప్పి ఓ ట్రాక్టర్ బోల్తా పడింది. ఈ ఘటన శుక్రవారం మండలంలోని బూరుగడ్డ గ్రామంలో చోటు చేసుకుంది. స్థానిక రైతులు తెలిపిన వివరాల ప్రకారం.. బూరుగడ్డ గ్రామానికి చెందిన చిమట వీరస్వామికి చెందిన ట్రాక్టర్‌కు డ్రైవర్‌గా ఆవుల సైదులు పనిచేస్తున్నాడు. డ్రైవర్ బూరుగడ్డ నుంచి హుజూర్‌నగర్‌కు వెళ్లే డొంకదారిలో వెళ్తుండగా ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తా పడిందని, దీంతో డ్రైవర్ సైదులు పక్కకు దూకడంతో ప్రాణపాయం తప్పిందని రైతులు తెలిపారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి గుంతలమయంగా ఉన్న డొంకదారికి మరమ్మతులు చేపట్టాలని పలువురు రైతులు కోరారు.


బోల్తాపడిన ట్రాక్టర్

ఆరుతడి పంటలపై అవగాహన

కోదాడరూరల్ : మండల పరిధిలోని చిమిర్యాలలో ఆరుతడి పంటల సాగుపై ఏఓ పి.రజిని శుక్రవారం రైతులకు అవగాహన కల్పించారు. బావులు, బోర్లలో నీటి లభ్యత మేరకే వరిసాగు చేసి ఆరుతడి పంటలైన పెసర, మినుము, బొబ్బెర పంటను సాగు చేసుకోని అధిక దిగుబడులు పొందాలని ఆమె సూచించారు. అదే విధంగా యాసంగి వరిసాగులో జింక్‌లోపం, మొగి పురుగు నివారణపై తీసుకోవాల్సిన చర్యలపై రైతులకు వివరించారు. కార్యక్రమంలో ఏఈఓలు నగేష్, ఝాన్సీ, రైతులు ఉన్నారు.

విద్యార్థికి సన్మానం

హుజూర్‌నగర్ : పట్టణంలోని గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థి కె.ప్రవీణ్‌కుమార్ ఉత్తరప్రదేశ్ రాజధాని లక్నోలో జరిగిన 67వ జాతీయ స్కూల్ గేమ్స్ (అండర్ 14) పోటీల్లో తెలంగాణ తరుపున స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ నిర్వహించిన పరుగు పందెంలో పాల్గొని బ్రాంజ్ మెడల్ సాధించాడు. దీంతో అతడిని శుక్రవారం పాఠశాలలో శాలువా పూలమాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాధాకృష్ణమూర్తి, వైస్ ప్రిన్సిపాల్ నందనాయక్, జీవీపీ రమేష్, పీఈటీలు పాల్గొన్నారు.

విద్యుత్ లైన్ ఏర్పాటుపై హర్షం

కోదాడఅర్బన్ : పట్టణంలోని 26వ వార్డులో విద్యుత్ అధికారులు పాత విద్యుత్ లైన్‌ను తొలగించి కొత్త స్తంభాలు, లైన్‌లు ఏర్పాటు చేయడంపై కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ ప్రాంతంలో విద్యుత్ సమస్యతో ఇంట్లోని ఎలక్ట్రానిక్ వస్తువులు కాలిపోతున్నాయని గతంలో విద్యుత్ అధికారులకు చెప్పినా పట్టించుకోలేదని వాపోయారు. ఈ సమస్యను ప్రస్తుత ఎమ్మెల్యే పద్మావతి దృష్టికి తీసుకెళ్లడంతో ఆమె స్పందించి సంబంధిత అధికారులను ఆదేశించడంతో సమస్యను పరిష్కరించారు. దీంతో కాలనీవాసులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వెంటాచారి, లక్ష్మీదుర్గ, పద్మ, అభినేష్, మారుతీ, రవి, గీత, వెంకటేశ్వర్లు ఉన్నారు.